నిర్లక్ష్యానికి నిదర్శనం.. మినీ బస్టాండ్

- ప్రారంభోత్సవం చేసి దశాబ్దకాలం పైనే
- నేటికీ వసతులు ఏర్పాటు చేయని వైనం


చింతలపూడిలో నిరుపయోగంగా ఉన్న మినీ బస్టాండ్

చింతలపూడి: అధికారుల నిర్లక్ష్యానికి చింతలపూడి మినీ బస్టాండ్ నిదర్శనంగా నిలుస్తోంది. మినీ బస్టాండ్ ప్రారంభోత్సవం జరిగి దశాబ్దకాలం గడుస్తున్నా.. ఇక్కడి సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పట్టించుకోలేదు. మరుగుదొడ్లు, మూత్రశాలలు వంటి కనీస సదుపాయాలు లేక ఈ బస్టాండ్ నిరుపయోగంగా మారింది. దీంతో బస్సులు సైతం ఇటువైపుగా రావడం లేదు. పాత బస్టాండ్ సెంటర్‌లోనే ప్రయాణికులు బస్సులు ఎక్కుతున్నారు. కనీసం కూర్చోవడానికి స్థలం లేక ప్రయాణికులు రోడ్డు పక్కన దుకాణాలు, హోటళ్లలో బస్సులకోసం నిరీక్షిస్తూ తలదాచుకుంటున్నారు. మొహిద్దీన్‌కుంట చెరువు పోరంబోకు స్థలంలో సుమారు రూ.18 లక్షల వ్యయంతో చెరువు అలుగు పారే కాల్వను అభివృద్ధి పరిచి మినీ బస్టాండ్ నిర్మాణాన్ని చేపట్టారు. 2010 మే నెలలో ఇక్కడున్న ఆక్రమణదారులను ఖాళీచేయించి మినీ బస్టాండ్‌కు శంకుస్థాపన చేశారు. ఈ నిధుల్లో రూ.9 లక్షలతో చెరువుకట్టకు కాంక్రీట్ గోడను నిర్మించి, చెరువు కళింగం నుంచి డ్రెయినేజీ నిర్మాణాన్ని చేపట్టారు. మిగిలిన రూ.9 లక్షలకు తోడు కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు సమకూర్చిన నిధులతో మినీ బస్టాండ్ నిర్మాణం చేపట్టారు. 2013 డిసెంబర్ 17న అప్పటి కేంద్ర మంత్రి కావూరి సాంబశివరావు మినీ బస్టాండ్‌ను ప్రారంభోత్సవం కూడా చేశారు. ఇప్పటివరకు ఏలూరు ఆర్టీసీ డిపో అధికారులు అనేకసార్లు వచ్చి మినీ బస్టాండ్‌ను పరిశీలించి వెళ్లారు. బస్టాండ్‌లో మరుగుదొడ్లు, మూత్ర శాలలు నిర్మించి బస్సులు బస్టాండ్‌కు వచ్చి వెళ్లేలా చర్యలు తీసుకోకపోవడంతో ప్రయాణికులకు ఉపయోగం లేకుండా పోయింది. ఇటీవల నగర పంచాయతీ అధికారులు మళ్లీ మినీ బస్టాండ్ ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకున్నా అవి కార్యరూపం దాల్చలేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మినీ బస్టాండ్‌ను ప్రయాణికులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే



లక్షలాది రూపాయలతో నిర్మించిన మినీ బస్టాండ్ నిరుపయోగంగా పడిఉంది. మిగిలిన పనులు కూడా పూర్తి చేసి మినీ బస్టాండ్‌ను అందుబాటులోకి తీసుకురావాలి. పాత బస్టాండ్ సెంటర్‌లో నిలువ నీడ లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

– సీహెచ్ జ్ఞానారెడ్డి, ప్రగడవరం

మరుగుదొడ్లు నిర్మించాలి



మినీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించాలి. బస్సుల రాకపోకలకు అనువుగా బస్టాండ్ ఆవరణను అభివృద్ధి చేసి, అధికారులు తక్షణం బస్టాండ్‌ను ప్రారంభోత్సవం చేయాలి.

– వెంపా కృష్ణ, బోయగూడెం, చింతలపూడి

క్లుప్తంగా

ఆర్ఎస్ఎస్‌ను పవన్ కొనియాడటం దుర్మార్గం


సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్

జంగారెడ్డిగూడెం: మహాత్మా గాంధీని హత్య చేసిన ఆర్ఎస్ఎస్ సంస్థ స్ఫూర్తి అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ అన్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు చేగువేరా స్ఫూర్తి అని, నేడు ఆర్ఎస్ఎస్ స్ఫూర్తి అని పవన్ కళ్యాణ్ పేర్కొనడం దుర్మార్గమన్నారు. ఆర్ఎస్ఎస్ సంస్థ దేనికి ఆదర్శం అని ప్రశ్నించారు. బ్రిటీష్ సామ్రాజ్యానికి తొత్తుగా వ్యవహరించిన సంస్థ అని, రైతు ఉద్యమంలో దమనకాండలో, మణిపూర్ మహిళలను నగ్నంగా, అతి కిరాతకంగా చంపిన ఘటనలో, జార్ఖండ్ క్రిస్టియన్ పాస్టర్ల ఊచకోతలో ఆర్ఎస్ఎస్ పాత్ర విస్పష్టం అన్నారు. అలాంటి ఆర్ఎస్ఎస్ స్ఫూర్తి అని పవన్ కొనియాడడం సిగ్గుచేటన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం డివిజన్ ఫోటో అండ్ వీడియో మిక్సింగ్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక ధర్మన్న భవనంలో నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మండిరెడ్డి వెంకటరెడ్డి, సెక్రటరీగా సీహెచ్ జగన్, కోశాధికారిగా చీపు ప్రసాద్, మరో 15 మందితో నూతన కార్యవర్గం ఎన్నికైంది. గౌరవాధ్యక్షులుగా వై.సూరిబాబు, సలహాదారులుగా కె.సోమరాజు, కె.బాలకృష్ణ, బండేశ్వరరావు, ఎం.బాలసుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు అమీర్ బాషా, జిల్లా ట్రెజరర్ మూర్తి, రాము, ఎస్.ప్రదీప్ కుమార్‌ల పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో న్యాయవాది యు.ఏసుబాబు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ, మంచిలి రాజు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత తప్పనిసరి

లింగపాలెం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధుల ముప్పు నుంచి సంరక్షించుకోవచ్చని ధర్మాజీగూడెం పీహెచ్‌సీ వైద్యురాలు ప్రీతి అన్నారు. బుధవారం తిమ్మక్కపాలెం గ్రామంలో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంట్లో దోమల నివారణ మందును చల్లించారు. సర్పంచ్ రత్తయ్య, ఎంపీహెచ్ఈఓ ఎం.రామ్మోహన్, సూపర్‌వైజర్‌లు పద్మజ, సారథి, గ్రామ కార్యదర్శి నవీన్, సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: స్థానిక గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు బుధవారం మధ్యాహ్న భోజన సమయంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్లాస్‌రూమ్‌లు, వంటశాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలకు సెక్యూరిటీకి కావాల్సిన షెల్టర్‌ను ఎమ్మెల్యే నిధులతో నిర్మించేందుకు కృషి చేస్తానని చెప్పారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎం.బుచ్చిరాజు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల: దొరసానిపాడు శివారులో బుధవారం సాయంత్రం పేకాట స్థావరంపై దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2,260 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై జి.సతీష్ తెలిపారు.

జంగారెడ్డిగూడెం: పేకాట స్థావరంపై జంగారెడ్డిగూడెం పోలీసులు బుధవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. స్థానిక దాంగేనగర్‌లో నిర్వహించిన దాడిలో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.1330 స్వాధీనం చేసుకున్నట్లు హెచ్‌సీ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

లైంగిక దాడులను అరికట్టాలి

బుట్టాయగూడెం: రాష్ట్రంలో బాలికలపై లైంగిక దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని పీడీఎస్‌యూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు బన్నే వినోద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టి.నర్సాపురం మండలం బొర్రంపాలెం, నంద్యాల జిల్లా నందికొట్కూరు డివిజన్ ముచ్చుమర్రి మండలం, గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం కమ్మరిపాలెం దళితవాడలో బాలికలపై లైంగిక దాడులు బాధాకరమని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలి

డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్ట


ఆసుపత్రి పరిసరాలను పరిశీలిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నందున వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంఅండ్ హెచ్ఓ శర్మిష్ఠ సూచించారు. మండలంలోని టి.నరసాపురం, బొర్రంపాలెం ప్రభుత్వ ఆసుపత్రులను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. టి.నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలు పరిశీలించారు. దిగువ ప్రాంతం కావడం వల్ల వర్షాలకు చుట్టూ ఆవరణ మొత్తం వర్షపు నీరు నిల్వ ఉండడంతో సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులకు లెటర్ పెట్టమని వైద్యులకు సూచించారు. నిర్మాణంలో ఉన్న అదనపు భవన నిర్మాణ పనులు కూడా పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించి సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు ప్రబలకుండా గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు, ఇంటింటి సర్వేలు నిర్వహించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోజులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జె.కల్పనారాణి, ఫణీంద్ర, ఆంజనేయులు, ఇమామ్ బి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు


కామవరపుకోట: గంగానమ్మకు ఆషాఢ సారె తీసుకెళుతున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: తొలి ఏకాదశి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. పట్టణంలోని విజయదుర్గమ్మ అమ్మవారు శాకాంబరిగా దర్శమిచ్చారు.

కొయ్యలగూడెం: టెంపుల్స్ సెంటర్లోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో శయన ఏకాదశి విశిష్టతను వివరించి భక్తులకు పేలాల పొడిని ప్రసాదంగా పంపిణీ చేశారు. కంకర కోనేరు గట్టుపై వెలసిన శ్రీ విధమ్మ అమ్మవారు విశేష అలంకరణతో పూజలు అందుకుంది. అంకాలగుడెం గ్రామంలో రజక సేవా సంఘం సభ్యులు విధమ్మ తల్లికి కుంకుమ పూజలు నిర్వహించారు.

బుట్టాయగూడెం: శయన ఏకాదశి పురస్కరించుకుని కుమ్మరిగట్టు సమీపంలో ఉన్న విజయగణపతి ఆలయంలో ఏకాహ మహోత్సవాన్ని నిర్వహించారు. వాసవి క్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గంగానమ్మ తల్లికి ఆషాఢ సారె సమర్పించారు. రెడ్డిగణపవరంలో కనకదుర్గమ్మ తల్లికి వివిధ రకాల స్వీట్లు, పండ్లు, పసుపు కుంకుమతో మొదటిసారిగా ఆషాఢ సారెను సమర్పించారు.

పోలవరం రూరల్: బోడిగూడెంలో శ్రీగిరి కొండపై వెలసిన శ్రీ పద్మావతి అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు మెట్ల మార్గంలో నడుచుకుంటూ రోడ్డు మార్గంలో వాహనాలపైనా కొండపైకి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు.

కామవరపుకోట: కామవరపుకోట కొత్తూరు గంగానమ్మ తల్లికి భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. వర్షాలు సకాలంలో కురిసి పాడిపంటలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ సారె సమర్పించినట్టు భక్తులు తెలిపారు.


జంగారెడ్డిగూడెం: పారిజాతగిరిలో స్వామివారికి పూజలు


కొయ్యలగూడెం: విశేష అలంకరణలో శ్రీవిధమ్మ అమ్మవారు


బుట్టాయగూడెం: రెడ్డిగణపవరంలో కనకదుర్గమ్మకు సమర్పించిన సారె

సీపీఎం శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని రోటరీ హాల్లో ఈనెల 18, 19, 20వ తేదీల్లో తలపెట్టిన సీపీఎం జిల్లా శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం కమిటీ సమావేశం నిర్వహించారు. టౌన్ కన్వీనర్ పి.సూర్యారావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి ఎ.రవి పాల్గొని మాట్లాడారు. శిక్షణ తరగతులకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, వై.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ శిక్షణ తరగతుల్లో పట్టణంలోని ప్రధాన సమస్యలు, అర్బన్ హౌసింగ్, ఏరియా ఆసుపత్రి, పట్టిన్నపాలెం వంతెన నిర్మాణం తదితర సమస్యలపై చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకుంటే కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, మండల కమిటీ సభ్యులు జి.సూర్యకిరణ్, ఎ.ప్రభాకర్‌రావు, పిల్లి చంటి తదితరులు పాల్గొన్నారు.

అడవులు జీవ వైవిధ్య నిలయాలు


కృష్ణాపురం అడవిలో విత్తనాలు చల్లుతున్న బంజార బజరంగీ భేరి నాయకులు

టి.నరసాపురం: కృష్ణాపురం గ్రామ అడవుల్లో బంజారా బజరంగీ భేరి కమిటీ ఆధ్వర్యంలో వేప, నేరేడు, జీడి, మామిడి, పనస, కుంకుడు, సీతాఫలం తదితర విత్తనాలు బుధవారం చల్లారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ అడవులు జీవ వైవిధ్య నిలయాలని అన్నారు. సీతలా భవాని అడవులను రక్షించి పశువులను, మానవులను కాపాడే బంజారాల వన దేవత అని, ఆమెను పూజించే కార్యక్రమంలో భాగంగా విత్తనాలు చల్లే కార్యక్రమం నిర్వహించామన్నారు. గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణు గోపాల్ మాట్లాడుతూ అడవులు వేగంగా అంతరించి పోతున్న క్రమంలో వాటిని కాపాడుకోడానికి లక్ష విత్తనాలు చల్లే కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు జరభల కృష్ణప్రసాద్, భూక్యా బిగనాధం, ధరావత్ రవి, బంగారయ్య, హసావత్ రవీంద్ర, భూక్యా రాములు, శ్రీనివాస్, భూక్యా చంటి, సురేష్, బద్దుబాబు, జరభల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కౌలు వివాదంపై పరస్పరం కేసులు నమోదు

జంగారెడ్డిగూడెం: భూమి కౌలుకు సంబంధించి ఏర్పడిన వివాదం నేపథ్యంలో ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఎస్సై జ్యోతిబాస్ తెలిపిన వివరాలివి. శ్రీనివాసపురం గ్రామంలోని పోల్నాటి మంగప్రసాద్‌కు రెండు ఎకరాలు భూమి ఉంది. ఇందులో ఒక ఎకరాన్ని వామిశెట్టి నరేష్ (పండు) అనే వ్యక్తికి ఈ ఏడాది కౌలుకు ఇచ్చాడు. అయితే గతేడాది సాగుచేసిన తమ్మిశెట్టి రామకృష్ణ తనకు కౌలుకు ఇవ్వకపోవడంతో మరో ముగ్గురు వ్యక్తులను వెంటబెట్టుకుని వచ్చి తమతో గొడవపడ్డాడని, ఈ ఘటనలో తన తండ్రిని, అడ్డు వెళ్లిన తనను కొట్టి గాయపర్చారని పోల్నాటి మంగప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా ఈ సంవత్సరం కూడా పొలాన్ని కౌలుకు తమకే ఇస్తానని పోల్నాటి మంగప్రసాద్ తెలపడంతో సదరు భూమిని 3 నెలల క్రితమే దుక్కి దున్నిట్లు తమ్మిశెట్టి నాగలక్ష్మి తెలిపింది. అయితే ఈ నెల 16వ తేదీన వామిశెట్టి నరేష్ అనే వ్యక్తి పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నుతుండగా, సదరు విషయాన్ని పోల్నాటి మంగప్రసాద్‌ను అడిగేందుకు తన భర్త తమ్మిశెట్టి రామకృష్ణ వెళ్లగా పోల్నాటి నాగేశ్వరరావు, మరొకరు తన భర్తపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చారని నాగలక్ష్మి ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

కుక్కునూరు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడగా మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వివరాల ప్రకారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ములకపల్లి మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెంకటాపురం మీదుగా బూర్గంపాడు వెళ్తున్న క్రమంలో పాములేరు వంతెన సమీపంలో వాహనం అదుపు తప్పికింద పడ్డారు. క్షతగాత్రులను స్థానికులు భద్రాచలం ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వారి పూర్తి వివరాలు తెలియరాలేదు.

అన్నప్రసాద వితరణ

జంగారెడ్డిగూడెం: స్థానిక వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బుధవారం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. తొలుత స్వామి వారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు కమిటీ సభ్యులు కొమ్మసాని రవీంద్రరెడ్డి తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.జ్యోతిబాస్ తెలిపారు. జంగారెడ్డిగూడెం టీచర్స్ కాలనీకి చెందిన యువతి ఇంటి వద్దే ఉండి ఇంజనీరింగ్ సీటు కోసం ప్రయత్నిస్తోంది. ఈ నెల 15వ తేదీన తల్లి బంధువుల ఇంటికి వెళ్లి మధ్యాహ్నం తిరిగి వచ్చేసరికి యువతి కనిపించలేదు. ఇప్పటివరకు ఆమె ఆచూకీ లభించకపోవడంతో యువతి తల్లి పద్మావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమ కుమార్తె కనిపించకపోవడంలో భీమవరం మండలం పాలపుంత గ్రామానికి చెందిన వెలుమాటి సాజిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

కారంచేడు వీరులకు ఘన నివాళులు


ద్వారకాతిరుమల అంబేడ్కర్ సెంటర్‌లో కారంచేడు వీరులకు నివాళులర్పిస్తున్న సిర్రా భరత్, తదితరులు

ద్వారకాతిరుమల: కారంచేడు మారణకాండ గురించి నేటి యువత తెలుసుకుని స్ఫూర్తి పొంది, పల్లెలను బాగు చేసుకోవాలని బీఎస్పీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు సిర్రా భరత్ పిలుపునిచ్చారు. కారంచేడు మారణకాండ జరిగి 38 సంవత్సరాలు గడిచిన సందర్భాన్ని గుర్తు చేస్తూ ద్వారకాతిరుమలలోని అంబేడ్కర్ సెంటర్‌లో బహుజన యువజన సంఘాలు కారంచేడు వీరులకు బుధవారం రాత్రి ఘన నివాళులు అర్పించాయి. ముందుగా వారు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, జై భీమ్ నినాదాలతో సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ గడచిన ఇన్నేళ్లలో బహుజనుల జీవితాల్లో మార్పేమి రాలేదన్నారు. ఆధిపత్య కులాల రాజకీయ అణచివేత కొనసాగుతూనే ఉందన్నారు. గతంలో సామూహికంగా హత్యలు చేస్తే, ఇప్పుడు విడివిడిగా బహుజనులను చంపేస్తున్నారని, వాటిపై విచారణలు కూడా సక్రమంగా జరగడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దళిత బాలికలు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతూనే ఉన్నాయని అన్నారు. యువజన సంఘాలు చుండూరు, కారంచేడు సంఘటనల చరిత్రను పూర్తిగా తెలుసుకుని వాటి నుంచి స్ఫూర్తి పొంది విద్య, ఉద్యోగాలు, రాజకీయాలపై అవగాహన పెంచుకుని అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుండుగొలనుకుంట, ఎం.నాగులపల్లి, దొరసానిపాడు గ్రామాలకు చెందిన యువజనులు మనెల్లి నాగరాజు, మంగరాజు, వంశీ, మద్దాల వెంకటేశ్వరరావు, చవటపల్లి ప్రేమ్, నవీన్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి


సమావేశంలో నినాదాలు చేస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: చంద్రబాబు హామీ ఇచ్చినట్లుగా భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ప్రముఖ న్యాయవాది యు.ఏసుబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) జంగారెడ్డిగూడెం డివిజన్ స్థాయి సమావేశం బోనంగి చిన్నబ్బాయి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఏసుబాబు మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా అసంఘటిత రంగ కార్మికులకు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అసంఘటితరంగ కార్మికులకు పని భద్రత ఉపాధి భద్రత కూడిన చట్టం చేస్తామని హామీ ఇచ్చిందని, ఆ హామీలు నిలబెట్టుకోవాలని అన్నారు. ఆటో మోటార్ రవాణా రంగ కార్మికులకు సంక్షేమ చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తొలుత ఇఫ్టూ రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు, నెల్లిమర్ల జూట్ కార్మికుల పోరాట ఉద్యమ సంస్థ నేత వురుటి ఉమామహేశ్వరరావు మృతిపై రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. సమావేశంలో డివిజన్ కార్యదర్శి మంచిలి రాజు, కోటా శివకృష్ణ, కొల్లి రాంబాబు, యడ్లపల్లి బుజ్జియ్య, వాసుబోయిన శ్రీను, కొత్తూరు వెంకటేశ్వరరావు, కొండయ్య, శ్యామలరావు, బాలం నరేష్, కె.సూర్య తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు న్యాయం చేయాలి


సమావేశంలో పాల్గొన్న మహిళలు

లింగపాలెం: చంద్రన్నపాలెం డ్వాక్రా మహిళలకు న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం జనరల్ బాడీ సమావేశం స్థానిక రామాలయం వద్ద నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, ఐద్వా జిల్లా కార్యదర్శి ఏ.శ్యామల రాణి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలను అన్యాయం చేసి మహిళలకు సంబంధించిన మొత్తం సొమ్ము రూ.28 లక్షలకు పైగా స్వాహా చేసిన ఏపీఎం, బ్యాంక్ మేనేజర్, గ్రామ వీఓఏలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికారులు సమగ్ర దర్యాప్తు జరపాలని, లేని పక్షంలో డ్వాక్రా మహిళలకు అండగా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఘనంగా మొహర్రం వేడుకలు


కొయ్యలగూడెం: జామియా మస్జీద్‌లో ఇఫ్తార్ దావత్ ఆచరిస్తున్న ముస్లింలు


పోలవరం రూరల్: నెల్లూరు రొట్టెల పండుగకు వెళుతున్న ముస్లింలు

పోలవరం రూరల్: పోలవరం మండలంలో మొహర్రం పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇమామ్‌లు మాట్లాడుతూ ఇమామ్ హుస్సేన్ శహదత్ జ్ఞాపకంగా మొహర్రంను జరుపుకుంటారని తెలిపారు. అనంతరం నెల్లూరులో రొట్టెల పండుగకు పోలవరం నుంచి ముస్లింలు బస్సులో తరలి వెళ్లారు. ప్రతీ ఏటా మొహర్రం పండుగ సందర్భంగా నెల్లూరులో జరిగే రొట్టెల పండుగకు పోలవరం నుంచి బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు మహబూబ్ జాని తెలిపారు. మార్గమధ్యలో ప్రతి దర్గా వద్ద దిగి ప్రత్యేక నమాజులు నిర్వహిస్తామన్నారు.

● **కొయ్యలగూడెం:** మొహర్రం పర్వదిన వేడుకలను బుధవారం ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించుకున్నారు. మొహర్రం నెల ప్రారంభంతో ముస్లింలకు నూతన సంవత్సరం ప్రారంభం అవుతుందని ఇమామ్‌లు పేర్కొన్నారు. మహమ్మద్ ప్రవక్త మనవడు అతని అనుచరులు యుద్ధరంగాన అమరులైనందుకు వారిని తలుచుకుంటూ మొహర్రం ఆచరించడం సంప్రదాయం అన్నారు. రెండు రోజుల ఉపవాస దినాలు ఆచరించిన ముస్లింలు మత పెద్దలకు, పూర్వీకులకు వారి ఆత్మశాంతికై మౌనం ఘటించి ఇఫ్తార్ దావత్‌ను సామూహికంగా పలు మసీదుల యందు ఆచరించారు. కొయ్యలగూడెం, కన్నాపురం, దిప్పకాయలపాడు, బయ్యనగూడెం, వేదాంతపురం, యర్రంపేట, రాజవరం గ్రామాలలో మొహర్రం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు జరుపుకున్నారు.

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

ద్వారకాతిరుమల: మొహర్రం పండుగను పురస్కరించుకుని బుధవారం ముస్లిం సోదరులు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని దొరసానిపాడు, ఐఎస్ రామానుజాపురం, తిరుమలంపాలెం, దేవినేనివారిగూడెం తదితర గ్రామాల్లోని మసీదులు ముస్లింలతో కళకళలాడాయి.